క్లుప్తంగా

ఉపాధ్యాయుడు నిరీక్షణ రాజుకు ఘన సత్కారం



ఉండ్రాజవరంలో ప్రత్తిపాటి నిరీక్షణరాజు దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఉండ్రాజవరం: ఉపాధ్యాయుడిగా నిరీక్షణ రాజు ఎందరో విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దారని ప్రధానోపాధ్యాయుడు పీవీ రామకృష్ణ అన్నారు. ఉండ్రాజవరం ఉన్నత పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయుడు ప్రత్తిపాటి నిరీక్షణ రాజు పదవీ విరమణ సందర్భంగా సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ నిరీక్షణరాజు అనేక ఉపాధ్యాయ శిక్షణ తరగతులకు రీసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించడమే కాకుండా ప్రభుత్వం నుంచి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం పొందారన్నారు. అనంతరం నిరీక్షణ రాజు, రమణి దంపతులను ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ఎస్.లక్ష్మీ నారాయణ వ్యాఖ్యాతగా వ్యవహరించగా, యూటీఎఫ్ నాయకులు ఐ.రాంబాబు, ఏపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర కౌన్సిలర్ కోట రామప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సేవలందించడమే మానవత లక్ష్యం



పాలంగిలో మానవత నూతన కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారం

ఉండ్రాజవరం: పేదలకు సేవలందించడమే మానవత లక్ష్యమని ఆ సంస్థ అధ్యక్షుడు కఠారి సిద్ధార్థరాజు అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఉండ్రాజవరం మండల నూతన కార్యవర్గ సభ్యులు సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. పాలంగిలో సీతారామ కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో వారు బాధ్యతలు స్వీకరించారు. అధ్యక్షుడిగా ఉప్పలపాటి శ్రీనివాసు, కార్యదర్శిగా అయిశెట్టి విజయరాజు, కోశాధికారిగా మట్టపర్తి భువన్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా వాకలపూడి రామకృష్ణ, జాయింట్ సెక్రటరీగా ఈద్పుగంటి నాగేశ్వరరావు, ఈసీ విద్య గుబ్బల వీరన్న, ఈసీ ఆరోగ్యం దొడ్డా సూర్యానారాయణ, ఈసీ అవేర్‌నెస్ పెద్దింటి గోపికృష్ణ, ఈసీ ఎమర్జెన్సీ గన్నమని ప్రసాద్ ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లా శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు, కె.రాధాపుష్పావతి, ఎస్వీ సతీష్ బాబు, టీవీ కృష్ణారావు, వేలిచేటి బోస్, ఎస్.పార్థసారథి, కడలి మాణిక్యాలరావు పాల్గొన్నారు.

ధాన్యం సొమ్ము కోసం రైతుల వినతి



తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందిస్తున్న రైతులు

నిడదవోలు: ధాన్యం సొమ్ము ఇప్పించాలని కోరుతూ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను కోరుతూ మండలంలోని సింగవరానికి చెందిన రైతులు ఆదివారం తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ అధికారులను కలుసుకుని వినతిపత్రం అందించారు. ఏప్రిల్ నెలలో ఆర్‌బీకేల ద్వారా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసిందన్నారు. ప్రభుత్వ ఆర్‌బీకేల ద్వారా సంబంధిత రైస్ మిల్లర్లకు ధాన్యం తరలించామని, రెండు నెలలు గడచినా వాటికి సంబంధించిన సొమ్ము ఇప్పటి వరకు అందలేదని రైతులు ఆవేదన చెందారు. బ్యాంకులు, కోఆపరేటివ్ సొసైటీల్లో తీసుకున్న రుణాలు చెల్లించే పరిస్థితి లేదని రైతులు వాపోయారు. ధాన్యం సొమ్ము ఇప్పించాలని రైతులు అధికారులకు విన్నవించారు. కార్యక్రమంలో చెరుకు శ్రీను, సైదు సూర్యనారాయణ, సైదు శ్రీను, నగేరు కోటసత్యం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

- మున్సిపల్ సమావేశంలో సభ్యుల డిమాండ్
- బియ్యపుగుంట చెరువు ఆక్రమణపై చర్యలేవీ?
- యోగాంధ్ర నిర్వహణకు రూ.4.70 లక్షల ఖర్చుపై అభ్యంతరం



మాట్లాడుతున్న వైస్ చైర్మన్ యలగడ బాలరాజు, సభ్యుడు ఆకుల ముకుందరావు



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ

నిడదవోలు: పట్టణంలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదని, ఎక్కడ పడితే అక్కడ చెత్త పేరుకుపోవడంతో అధ్వానంగా తయారయ్యాయని, వీధిలైట్లు నిర్వహణ లోపాలు, మున్సిపల్ స్థలాలు ఆక్రమణలపై కౌన్సిల్ సమావేశంలో సభ్యులు ఏకరువు పెట్టారు. నిడదవోలు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ, ప్రత్యేక సమావేశాలను సోమవారం మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించారు. అజెండాలోని 34 అంశాలను సభ్యులు ఆమోదించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ మాట్లాడుతూ పట్టణంలో దీర్ఘకాలిక సమస్యలపై దృష్టి సారించామన్నారు. రూ. 83.82 కోట్ల వ్యయంతో పట్టణ శివారు ప్రాంతాలకు సైతం మంచినీరు అందించాలనే ఉద్దేశ్యంతో గోదావరి జలాల పథకం మంజూరైందని, టెండర్ల ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఎన్టీఆర్ కాలనీలో రూ.5.96 కోట్లతో మంచినీటి రిజర్వాయర్, రూ.4 కోట్లతో మాలకోడు ప్రక్షాళన, పట్టణంలో 220 సీసీ టీవీ కెమెరాల ఏర్పాటు తదితర పనులకు చర్యలు చేపట్టామన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ యలగడ బాలరాజు మాట్లాడుతూ పట్టణంలో రెండు నెలలుగా పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదని, రెండు రోజులకు ఒకసారి చెత్త సేకరిస్తున్నారని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి వార్డులో సుమారు 10 వీధిలైట్లు వెలగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వీధుల్లో చెత్త పెరగడంతో దుకాణదారులు, మహిళలు ప్రశ్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్ ఉదయం వార్డుల్లో పర్యటనకు రావాలని ఆమెతో కలిసివెళ్లి పారిశుధ్య పరిస్థితులను తెలుసుకుంటామన్నారు. దీనిపై మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ పారిశుధ్య మెరుగుదలకు అవసరమైన పరకరాల సరఫరాలో కాంట్రాక్టర్ అలసత్వం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లేకపోవడంతో ఇబ్బందులున్నాయని వాటిని అధిగమించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కౌన్సిలర్ ఆకుల ముకుందరావు మాట్లాడుతూ బాలాజీనగర్‌లో బియ్యపు గుంట చెరువును రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించుకున్నారని, దీనిపై ఫిర్యాదు చేసినా ఇంతవరకు అధికారులు చర్యలు చేపట్టలేదన్నారు. దీనిపై కమిషనర్ టి.కృష్ణవేణి సమాధానం ఇస్తూ అక్కడ ఉన్నది బియ్యపుగుంట చెరువు కాదని, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ క్యాంపు కార్యాలయం, శశి స్కూలుకు వెళ్లే రోడ్డు కావడంతో అక్కడ ఉన్న ఓపెన్ ప్లేస్‌లో వర్షపు నిలిచిపోతుందనే పూడ్చించామన్నారు. కౌన్సిలర్ ముకుందరావు కలుగ చేసుకుని చెరువు ఆక్రమణపై రైతులు పోరాటం చేస్తున్నారని దీనిపై తగిన చర్యలు తీసుకొని మున్సిపల్ ఆస్తులను కాపాడాలని కోరారు. కౌన్సిలర్ దాకే అనిల్‌కుమార్ మాట్లాడుతూ యోగాంధ్ర పేరుతో రూ.4.70 లక్షలు ఖర్చును కౌన్సిల్ ఆమోదానికి తీసుకురావడంపై అభ్యంతరం తెలిపారు. దీనిపై మున్సిపల్ ఏఈ హేమంత్‌కుమార్ సమాధానం ఇస్తూ 13 సచివాలయాల పరిధిలో యోగా శిక్షణ తరగతులు నిర్వహించామని, కార్పెట్లు, హోర్డింగులు, ఆర్ట్ పెయింటింగ్, ర్యాలీ, సర్టిఫికెట్ల కోసం ఖర్చు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఖర్చులపై బిల్లులు చూపించాలని కౌన్సిలర్ దాకే అనిల్ కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్కే వజీరుద్దీన్ మాట్లాడుతూ వైఎస్సార్ కాలనీలో వర్షం వస్తే రోడ్లు పాడైపోయి నడవలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని రోడ్లు, డ్రైయిన్లు నిర్మించాలని కోరారు.

- ప్రత్యేక సమావేశంలో ఏడాది పాటు కొనసాగే కాంట్రాక్టు, ఫ్యానల్ కమిటీలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కౌన్సిలర్ ఎండీ షకీరాబేగం కాంట్రాక్టు కమిటీని ప్రతిపాదించగా మరో కౌన్సిలర్ ముంగండి మాణిక్యమాల బలపరచడంతో ఆమోదించారు. ఫ్యానల్ కమిటీని కౌన్సిలర్ చిలకల శారదాదేవి ప్రతిపాదించగా మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్కే వజీరుద్దీన్ బలపరచడంతో కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించారు.
- మున్సిపల్ కాంట్రాక్టు కమిటీ చైర్మన్‌గా కౌన్సిలర్ కారింకి నాగేశ్వరరావు, సభ్యులుగా మానుపాటి లక్ష్మీ, మద్దిపాటి నాగశ్రీ, చిలకల శారదాదేవి, గంగుల వెంకటలక్ష్మీ, గోపిరెడ్డి శ్రీనివాస్‌ను ఎంపిక చేశారు. ఫ్యానల్ కమిటీ చైర్ పర్సన్‌గా గుర్రం శాంతిశ్రీ, సభ్యులుగా ఆరుగొల్లు వెంకటేశ్వర్లు, ఎండీ షకీరాబేగం, ఉసురిమర్తి జాన్‌బాబు, ముంగంటి మాణిక్యమాల, సైదు చంద్రశేఖర్‌ను ఎంపిక చేశారు.

రైస్‌మిల్లు కాలుష్యాన్ని అరికట్టండి

పీజీఆర్ఎస్‌లో ప్రజల ఫిర్యాదు



దేవరపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అర్జీ అందజేస్తున్న ప్రజలు

దేవరపల్లి: స్థానిక సినిమా థియేటర్ సమీపంలోని వరలక్ష్మి రైస్‌మిల్లు నుంచి వచ్చే కాలుష్య సమస్యను పరిష్కరించాలని కోరుతూ సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో పరిసర ప్రజలు అర్జీ అందజేశారు. మిల్లు నుంచి ఊకను విడిచిపెట్టడం వల్ల ఊక, దూగర, తవుడు వంటి వ్యర్థాలు గాలికి ఎగిరి ఇళ్లపై పడుతున్నాయని, అవి గాలిలో కలవడం వల్ల అనారోగ్యాలకు గురవుతున్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. దురదలు, ఊపిరితిత్తులు, కంటి సమస్యలతో బాధపడుతున్నట్టు పరిసర ప్రజలు అధికారులకు మొరపెట్టుకున్నారు. సుమారు మూడు సంవత్సరాల నుంచి కాలుష్య సమస్యతో ఇబ్బంది పడుతున్నామని, మిల్లు చుట్టూ సుమారు 50 గృహాలు ఉన్నట్టు అధికారులకు వివరించారు. వ్యర్థాలు బయటకు రాకుండా చర్యలు తీసుకోవాలని మిల్లు యజమానికి చెప్పినప్పటికీ పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోయారు. సమస్యను పరిష్కరించి తమ ఆరోగ్యాలను కాపాడాలని ప్రజలు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో జాజిమొగ్గల దుర్గ, కె.రత్నకుమారి, బోడపాటి మంగతయారు, బోడపాటి నాగలక్ష్మి, జాజిమొగ్గల సూర్యారావు, గుంటూరు వరలక్ష్మి, సీతారామరాజు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కుటుంబాలకు వనిత పరామర్శ



చిన్నాయిగూడెంలో ముంగమూరి పాప చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి తానేటి వనిత

దేవరపల్లి: ఇటీవల వైఎస్సార్ సీపీకి చెందిన పలువురు నేతలు, కార్యకర్తల మృతి చెందడంతో ఆయా కుటుంబాలను సోమవారం మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యురాలు, నియోజకవర్గ సమన్వయకర్త తానేటి వనిత పరిమర్శించారు. మండలంలోని త్యాజంపూడి, చిన్నాయిగూడెం గ్రామాల్లో పర్యటించారు. పార్టీ నాయకులతో కలిసి మృతుల ఇళ్లకు వెళ్లి వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. త్యాజంపూడిలో సొసైటీ మాజీ అధ్యక్షుడు కాకర్ల శోభన్‌కుమార్ తండ్రి వెంకటరమణ ఇటీవల మృతి చెందారు. ఆయన కుమారుడు శోభన్‌కుమార్, గజల కుమార్‌ను, చిన్నాగూడెంలో ఇటీవల మృతి చెందిన ముంగర పాప కుటుంబ సభ్యులను, మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యురాలు అస్మత్ ఉన్నీషా బేగం భర్త గౌస్ అహ్మద్ మరణించడంతో ఆమెను మాజీ మంత్రి వనిత పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ కేవీకే దుర్గారావు, మండల పార్టీ అధ్యక్షుడు కూచిపూడి సతీష్, జిల్లా అధికార ప్రతినిధి గడా జగదీష్, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి నరహరిశెట్టి రాజేంద్రబాబు, సహాయ కార్యదర్శి గడా రాంబాబు, రాష్ట్ర బీసీ విభాగం ప్రధాన కార్యదర్శి మేడిబోయిన గంగరాజు, పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కుసులూరి వెంకటసతీష్, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షులు సత్తి జగదీష్ రెడ్డి, ఆచంట సురేష్, మండల రైతు విభాగం అధ్యక్షులు పల్లి రత్నారెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు పోతుల కృష్ణారెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు కుసులూరి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ దోనెల్లి జానకీరామ్, చిటికిన గంగరాజు, బొమ్మనబోయిన శ్రీను, మాజీ ఎంపీటీసీ సభ్యుడు బడితే పాపారావు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే తలారి పరామర్శ



ధర్మవరంలో బాపినీడు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే తలారి

తాళ్లపూడి(కొవ్వూరు): ధర్మవరం గ్రామానికి చెందిన కుందుల బాపినీడు ఇటీవల మృతి చెందారు. సోమ వారం నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ వెంపాటి సురేష్‌కుమార్, కుందుల బలరామకృష్ణ, కొంకా శంకర్, కుందుల సుబ్బారావు తదితరులున్నారు.

త్వరలో ఎర్రకాలువ ఆధునీకరణ పనులు

నిడదవోలు: ఎర్రకాలువ ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం సమగ్ర ప్రణాళిక రూపొందించి అమలు చేస్తామని, త్వరలో ఎర్రకాలువ ఆధునీకరణ పనులు ప్రారంభిస్తామని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గతేడాది భారీ వర్షాలు, వరదల కారణంగా నియోజకవర్గంలోని ఎర్రకాలువ ముంపునకు గురై పంట నష్టపోయిన 4,631 మంది రైతులకు రూ.5.22 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ విడుదలైనట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ 2024 జూలైలో కురిసిన భారీ వర్షాల కారణంగా నిడదవోలు నియోజకవర్గంలోని ఎర్రకాలువ వరదలతో పలు గ్రామాల్లో పంటలు ముంపునకు గురయ్యాయన్నారు. అనేక ప్రాంతాల్లో 3,071.41 హెక్టార్లలో పంటలు నష్టపోయి రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరైందన్నారు. రైతుల ఖాతాల్లో రూ.5.22 కోట్లు పంట నష్టపరిహారం జమ చేస్తామని తెలిపారు.

పది గంటల పని విధానాన్ని ఉపసంహరించాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సుందర్‌బాబు



దూబచర్లలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సుందర్‌బాబు

దేవరపల్లి: రాష్ట్ర కేబినెట్ ఆమోదించిన పది గంటల పని విధానాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందర్‌బాబు డిమాండ్ చేశారు. నల్లజర్ల మండలం దూబచర్లలో సోమవారం సీఐటీయూ మండల అధ్యక్షుడు కొక్కిరిపాటి వెంకట్రావు అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాయడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో సంపదను పెట్టుబడిదారులు సృష్టిస్తున్నప్పుడు కార్మికుల పని గంటలను పెంచాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. పగటి పూట భద్రత లేని శ్రామిక మహిళలకు రాత్రిపూట పని ప్రదేశంలో ఎవరు భద్రత కల్పిస్తారని నిలదీశారు. రోజుకు 8 గంటలకు మించి పనిచేయడం వల్ల కార్మికుల మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని శాస్త్రీయ పరిశోధనలో వెల్లడైన విషయాన్ని గుర్తు చేశారు. పని గంటలు పెంచడమంటే కార్మికులను సమష్టి జీవన విధానానికి దూరం చేసి కుటుంబాలను విచ్ఛిన్నం చేయడమేనన్నారు. ఇప్పటికీ చంద్రబాబుకు ప్రపంచ బ్యాంకు ముద్దుబిడ్డ అనే పేరుందని, అందులో భాగంగానే కార్మికవర్గంపై చంద్రబాబు యుద్ధం చేస్తున్నారని ఆరోపించారు. పెంచిన పని గంటలను తక్షణం ఉపసంహరించుకోవాలని, లేదంటే కార్మికుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తోందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మండల కమిటీ అధ్యక్షుడు కొక్కిరిపాటి వెంకట్రావు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాలను సవరించి 14 ఏళ్లు అవుతుందన్నారు. ఈ కాలంలో అన్ని రకాల ధరలను పెంచిన ప్రభుత్వం కార్మికుల వేతనాలు పెంచకపోతే ఎలా బతుకుతారని ప్రశ్నించారు. ప్రతి కార్మికుడికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. జూలై 9న జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సీఐటీయూ మండల కార్యదర్శి బొంగు వీరభద్రం, నాయకులు పెనుమాక వెంకట్రావు, విమలాబాయ్, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అసర్ నివేదికతో గుణాత్మక మార్పులు



డైట్ కళాశాలలో అసర్ నివేదికను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, జిల్లా కోఆర్డినేటర్

దేవరపల్లి: విద్యా కార్యక్రమాల ప్రగతికి అసర్ నివేదిక ఎంతో ఉపయోగపడుతుందని నల్లజర్ల మండలం దూబచర్ల జిల్లా విద్యా శిక్షణ సంస్థ 2024 (స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిపోర్ట్) నివేదికను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎం.కమల కుమారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడారు. ఈ నివేదికల ఆధారంగా విద్యలో మరింత గుణాత్మకతను పెంచడానికి చర్యలు తీసుకుంటామని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా అసర్ కార్యక్రమం కో–ఆర్డినేటర్ డి. సోమసుందరం మాట్లాడుతూ నివేదికలోని ముఖ్యాంశాలను విశ్లేషించారు. మోటివేషన్ స్పీకర్ టి. గంగాధర్ మాట్లాడుతూ విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి సంబంధించి వివిధ సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సీహెచ్ లక్ష్మీనారాయణ, సుబ్రహమణ్యం, శామ్యూల్ సంజీవ్, ఎ. గుప్తా, శ్రీస్వరాజ్య శ్రీనివాస్, బి.జాన్సన్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీయం

నిడదవోలు: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో నిత్యం కార్మికులు అందిస్తున్న సేవలు అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. మున్సిపాలిటీలో పనిచేస్తున్న రెగ్యులర్ పారిశుధ్య కార్మికులు కాకి సూర్యప్రకాశరావు, కాకి ఈశ్వరమ్మ, కాకి జానకమ్మ, అత్తిలి ధనలక్ష్మీ సోమవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా కార్మికులను మున్సిపల్ కౌన్సిల్ హాలులో ఘనంగా ఘనంగా సత్కరించారు. పదవీ విరమణ చేసిన ఈ నలుగురు కార్మికులకు పింఛన్ మంజూరు పత్రాలను చైర్మన్ ఆదినారాయణ అందజేశారు. మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

తాళ్లపూడి: పెద్దేవంలో సోమవారం రాత్రి విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతి చెందాడు. గ్రామానికి చెందిన ముదునూరి వెంకటేష్ (26) గ్రామంలో ప్రైవేట్ ఎలక్ట్రికల్ పనులు చేస్తుంటాడు. గ్రామంలో లైన్‌మెన్‌కు అసిస్టెంట్‌గా పని చేస్తున్నట్టు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. 11 కేవీ విద్యుత్ స్తంభం వద్ద పనిచేస్తున్న సమయంలో విద్యుదాఘానికి గురై వెంకటేష్ మృతి చెందినట్టు గ్రామస్తులు, కుటుంబ సభ్యులు చెబుతున్నారు. మృతుడికి తల్లి సత్యవతి మాత్రమే ఉంది. ఆమె తన కొడుకు వెంకటేష్‌పై ఆధారపడి జీవిస్తోంది. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేసారు. తాళ్లపూడి ఎస్సై టి రామకృష్ణ ఘటనా ప్రదేశంలో వివరాలు సేకరించారు.

సీఎం చంద్రబాబు పర్యటనకు ఏర్పాట్లు



మలకపల్లిలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్, మంత్రి కందుల దుర్గేష్

తాళ్లపూడి: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మండలంలోని మలకపల్లిలో మంగళవారం పర్యటించనున్న నేపథ్యంలో సోమవారం ఏర్పాట్లు చేయడంలో అధికారులు నిమగ్నమయ్యారు. సీఎం చంద్రబాబు ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీ, చర్మకారుల పెన్షన్లు అందజేసే కార్యక్రమం, అనంతరం పీ4 ప్రజావేదిక గ్రామ సభ, కాపవరం వద్ద కార్యకర్తల సమావేశం ఉంటుందని తెలిపారు. కాపవరంలో జాతీయ రహదారి సమీపంలో హెలీప్యాడ్‌ను ఏర్పాటు చేస్తున్నా న్నారు. గ్రామంలో పారిశుధ్య చర్యలతో పాటు పలు పనులు చేపట్టారు. కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులకు దిశా నిర్దేశం చేసారు. రాష్ట్ర పర్యాటక శాఖమంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సమావేశం విజయవంతం చేయడంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కొవ్వూరు ఎంపీపీ కాకర్ల నారాయుడు, మండల కూటమి నాయకులు నామన పరమేశ్వరరావు, గంటా కృష్ణ, మద్దిపాటి ప్రకాశం తదితరులున్నారు.

మలకపల్లిలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు

తాళ్లపూడి(కొవ్వూరు): జూలై 1న కొవ్వూరు నియోజకవర్గం తాళ్లపూడి మండలం మలకపల్లిలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో సోమవారం పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, కలెక్టర్ పి.ప్రశాంతి జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జేసీ ఎస్.చినరాముడు, రాజమండ్రి ఆర్డీవో ఆర్. కృష్ణనాయక్, కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, అదనపు ఎస్పీలు ఎం.మురళీకృష్ణ, సుబ్బరాజు, కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ తదితర జిల్లా పోలీస్ యంత్రాంగంతో ఏర్పాట్లపై వారు దిశా నిర్దేశం చేసారు. అన్ని శాఖల అధికారులు బాధ్యతాయుతమైన విధులు నిర్వర్తించాలని, కార్యక్రమం విజయవంతం చేయడానికి కృషి చేయాలని మంత్రి దుర్గేష్ అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.